సాక్షి
చిత్తూరు
సోమవారం । 13 । జనవరి । 2025



పార్వతీదేవిలా పెంచితే..
నవమోసాలు మోసి పెంచి పెద్దచేసిన తల్లి అవసాన దశలో ఉందని.. కొడుకులు నడిరోడ్డుపై వదిలేశారు. - 10లో



పండుగ వేళ.. బాదుడు
వరుస సెలవుల రావడంతో సొంతూర్లకు వెళ్లే వారి నుంచి ప్రైవేట్ ట్రావెల్స్ అధిక చార్జీలు పెంచి వసూలు చేస్తున్నారు. - 10లో



కిటకిటలాడిన బోయకొండ
ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తుల తాకిడితో కిటకిటలాడింది. - 10లో

న్యూస్‌రీల్

ప్రతి ఇంటా భోగిభాగ్యాలు కలగాలి



మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



ఎంపీ మిథున్‌రెడ్డి

పుంగనూరు: నూతన సంవత్సరంలో భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను ప్రజలంతా సుఖ సంతోషాలతో జరుపుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట పార్లమెంటు సభ్యులు పెద్దిరెడ్డి వెంకటమిథున్ రెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం వారు మాట్లాడుతూ ఈ సంక్రాంతికి ప్రతి ఇంటా భోగిభాగ్యాలు కలగాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరూ పండుగను సంతోషంగా జరుపుకోవాలని కోరారు. పంటలు బాగా పండి, వ్యాపారాలు బాగా వృద్ధి చెంది, ప్రతి ఇంటా సిరులు పండాలని ఆకాంక్షించారు.

నేడు గ్రీవెన్స్ రద్దు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)ను ఈ నెల 13న రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 13న భోగి పండుగ (ప్రభుత్వ సెలవు) రోజు కావడంతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు చేస్తున్నట్లు చెప్పారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని కోరారు.

ఎస్సీ ఉద్యోగుల వివరాలు పంపండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని పాఠశాల విద్యాశాఖలో పనిచేస్తున్న ఎస్సీ ఉద్యోగుల వివరాలను పంపాలని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయ రామరాజు ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. ఆ మేరకు పాఠశాల విద్యాశాఖలో పనిచేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగుల వివరాలు పంపాలన్నారు. 2014 నుంచి 2024 వరకు వివరాలను సేకరించి జారీ చేసిన ప్రత్యేక ఫార్మాట్‌లో పంపాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రజా పరిష్కార వేదిక రద్దు

చిత్తూరు అర్బన్: సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను అధికారులు రద్దు చేశారు. చిత్తూరు నగరంలోని ఏఆర్ కార్యాలయంలో సోమవారం జరిగే కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. అలాగే నగరపాలక కార్యాలయంలో కూడా ఈ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కార్పొరేషన్ అధికారులు పేర్కొన్నారు.

సంక్రాంతి అంటే పల్లెల్లో చెప్పలేనంత సందడి ఉంటుంది. పంటలను అమ్మి ఇంటి సరుకులు తెచ్చుకునేవారు. ప్రభుత్వం ఇచ్చే పథకాలతో ఇంటిల్లి పాది మూడు రోజుల పాటు ముచ్చటగా పండగ చేసుకునేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్నంత వరకు పేదింట నవరత్నాలు కాంతులీనాయి. ప్రస్తుతం పేదింట సంక్రాంతి కళ తప్పింది. నిత్యావసర సరుకుల ధరలు అమాంతం పెరగడంతో.. పండక్కి పైసలు లేక పల్లెజనం విలవిల్లాడుతున్నారు. వరుస తుపాన్ల కారణంగా రైతన్నకు తీరని నష్టం మిగిలింది. మరోవైపు ప్రభుత్వ సాయం కరువైంది.



కళ తప్పిన సంక్రాంతి

తాళంబేడులో కనిపించని పండుగ సందడి

- పండక్కి పైసలు లేక జనం విలవిల
- వరుస తుపానులతో చేతికందని పంట
- రైతులకు అందని పెట్టుబడి సాయం
- సూపర్ సిక్స్ హామీలు హుళక్కే..!
- పెరిగిన నిత్యావసర ధరలు.. అందని సంక్షేమ ఫలాలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): సంబరాలు మోసుకొచ్చే సంక్రాంతి పండుగ ఈ ఏటా చిత్తూరు జిల్లావ్యాప్తంగా కళ తప్పింది. రైతుల ఇంట ఆనందాలు పంచే ఈ పండుగ కాంతులు లేకుండా పోయాయి. చిత్తూరు మండలం తాళంబేడు పంచాయతీలో మొత్తం 745 కుటుంబాలు ఉండగా 2924 మంది జనాభా ఉంది. గ్రామంలో అధికంగా వ్యవసాయం, పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. కొంతమంది చిన్న చిన్న వ్యాపారాలు, దినసరి కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. గతంలో వీరికి ప్రభుత్వ పథకాలు తోడుగా నిలిచేవి. ఆ పథకాల ద్వారా వచ్చే సాయం నిధులు ప్రతి పేదింటా సంక్రాంతి కళను తీసుకొచ్చేవి. పెద్దపండుగ ముందస్తు ఏర్పాట్లలో భాగంగా గ్రామస్తులు ఏకమై చందాలు వేసుకునేవారు. ఊరు పెద్దల సమక్షంలో సంక్రాంతికి ఏయే కార్యక్రమాలు నిర్వహించాలో నలుగురికి బాధ్యతలు అప్పగించేవారు. అలా గ్రామంలో విద్యుత్ దీపాలు ఏర్పాటుచేసి పండుగ సందడి ప్రారంభమయ్యేది. ఊళ్లోని రాములుగుడి, వినాయకుడి ఆలయం, ఈశ్వరగుడి, ద్రౌపదమ్మ ఆలయాలను అలంకరించేవారు. భోగి మంటలు వేసేందుకు సిద్ధం చేసేవారు. ఈక్రమంలో బెంగళూరు, ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా ఊర్లోకి చేరుకునేవారు. భోగి నుంచి మకర పర్వదినం పూర్తయ్యేంత వరకు ఇంటి గుమ్మం ముందు ముత్యాల ముగ్గులు, గొబ్బెమ్మలు దర్శనమిచ్చేవి. ఇళ్లల్లో పిండి వంటలు ఘుమఘుమలాడేవి. బంధువుల రాకతో ఊరంతా సందడిగా ఉండేది. మూడు రోజులపాటు సంబరాలు చేసుకునే ఆ ఊరిలో ప్రస్తుతం వెలవెలబోతోంది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇలా..

2019 నుంచి 2024 వరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను పెద్ద ఎత్తున అందించింది. 2019 నుంచి ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లూ సంక్షేమ పథకాలు పక్కాగా అమలు చేశారు. ఒక్కో కుటుంబానికి సగటున ఏడాదికి రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు లబ్ధి చేకూరేది. ఇలా తాళంబేడుకు గత ఐదేళ్ల కాలంలో 24 పథకాల ద్వారా 4298 మంది లబ్ధిదారులకు రూ.14 కోట్ల మేర లబ్ధి చేకూరింది. దీంతో పండుగలను ఘనంగా జరుపుకునేవారు.

గత ప్రభుత్వంలో జనవరి నెలలో అందిన పథకాలు..

- రైతుభరోసా
- చిరువ్యాపారులకు జగనన్న తోడు
- వైఎస్సార్ ఆసరా..
- విద్యా దీవెన

తాళంబేడు గ్రామవివరాలు

మొత్తం కుటుంబాలు	745
వలస కుటుంబాల సంఖ్య	89
వ్యవసాయ కుటుంబాలు	423
జనాభా	2974
ఐదేళ్లల్లో లబ్ధిదారుల సంఖ్య	4298
లబ్ధి	రూ.14 కోట్ల మేర
మామిడి	225 ఎకరాలు
ఖరీఫ్‌లో వరి సాగు	22.34 ఎకరాలు
వేరుశనగ	100 ఎకరాలు
రబీలో వరి	15 ఎకరాలు

పంటలు లేక..

సంక్రాంతి అంటే రైతులకు పెద్ద పండుగ. ఈ సమయంలో కొన్ని రకాల పంటలు చేతికివస్తాయి. అయితే ఈసారి అధిక వర్షాలు, తుపాన్ల కారణంగా పంటలు చేతికందలేదు. తాళంబేడులో ప్రధానంగా మామిడి సాగు 225 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఈసారి దిగుబడి రాలేదు. వేరుశనగ ఉసూరుమనిపించింది. 100 ఎకరాల్లో పంట నేలమట్టం కావడంతో.. కందిపై ఆశలు పెట్టుకుంటున్నారు. తుపాను ప్రభావంతో ఖరీఫ్ సమయంలో సాగులోకి తెచ్చిన వరి, కూరగాయల పంటలు పూర్తిగా తడిసి ముద్దయ్యాయి. రబీ సీజన్ దృష్ట్యా వేసిన వరి 15 ఎకరాల్లో మొలకెత్తుతోంది. ఇలాంటి తరుణంలో రైతులకు పెట్టిన పెట్టుబడి రాక అప్పులు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో పెద్ద పండగకు రైతన్నలను ఆర్థిక కష్టాలు వెంటాడుతున్నాయి.



గతేడాది సంక్రాంతి విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ఇప్పుడేమైందంటే..!

కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడు నెలలు పూర్తవుతున్నా రైతులకు, ఇతర వర్గాలకు ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు కాలేదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్–6 హామీల్లో రైతులకు ఏటా రూ.20 వేలు పెట్టుబడి సాయం, తల్లికి వందనం పథకంలో భాగంగా ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ ఏడాదికి రూ.15 వేలు, పొదుపు మహిళలకు రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు, ఆడబిడ్డలకు నెలకు రూ.1500 ఇస్తామని నమ్మించారు. అధికారంలోకి వచ్చిన తరువాత కూటమి ప్రభుత్వంలోని పాలకులు ఒక్కటంటే ఒక్క పథకం పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడంతో పల్లె జనం ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు నిత్యావసర, కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. వంటనూనె రూ.160, తెల్లగడ్డ రూ.400, ఎర్రగడ్డ రూ.70, కందిపప్పు రూ.200, ఇతర పప్పు దినుసులు కూడా రూ.వందకు పైమాటే. దీంతో పండుగ పూట తాళంబేడు గ్రామస్తులకు పస్తులు తప్పలేదు.



నేడు దీనంగా కూర్చున్న తాళంబేడు గ్రామస్తులు

ఏం ఉండాదని చేసుకునేది ?



మార్కెట్లో ఏం కొన్నాలన్నా రేట్లు బాగా పెరిగిపోయి ఉండాయి. తెల్లగడ్డ రూ. 400 అట. కూరగాయలు కూడా కొనేటట్టు లేదు. ఈ టైంలో ఏం పండగా చేసుకునేది. ముందు గవర్నమెంట్ ఆ డబ్బులు..ఈ డబ్బులు ఇస్తా ఉండేది. ప్రతి సంవత్సరం నాకు రూ.17,500 వచ్చేది. ఆ డబ్బులతో పండుగ చేసుకునేవాళ్లు. ఇప్పుడు ఏం ఉండాడదని పండగ చేసుకునేది.

– గిరిజ, తాళంబేడు

డల్‌గా ఉండాది



మేము చిన్నచిన్న వ్యాపారం చేస్తా ఉండాం. అడపాదడపా కూరగాయలు, ఆ పంట..ఈ పంట పండిస్తాం. అదునుకు వర్షాలు లేక పంటలు వేసేది మానుకున్నాం. పోయినసారి పండుగ బాగానే చేసుకున్నాం. వైఎస్సార్ ప్రభుత్వం ఇచ్చిన డబ్బు మిగులు చేసుకుని పిల్లలకు బట్టలు కొనిచ్చి పండుగ చేసుకున్నాం. ఈ సారి చానా డల్‌గా ఉంది.

– పుష్ప, తాళంబేడు

ఊరంతా బోసి పోయింది



సామీ.. ముందు నాకు అమ్మఒడి, ఆసరా డబ్బులు వస్తా ఉండేది. కరెక్టుగా పెద్ద పండగ టైంకు ఆసరా డబ్బు లు వచ్చేవి. ఆ డబ్బులతో ఇంటికి సరుకులు, కొత్త బట్ట లు తెచ్చుకునేవాళ్లం. ఇప్పుడు సంక్రాంతి కానుక అయినా ఇస్తారా అనుకుంటే అది కూడా ఇవ్వలేదు. ఎట్లా పండుగ చేసుకోవాలి. అందుకే ఊరంతా బోసి పోయి ఉండాది.

– రాజేశ్వరి, తాళంబేడు

పండగ యాడ ..!



గతేడాది మామిడి పంటలేదు. దిగుబడి తక్కువ. వరి వేద్దామనుకుంటే రబీ ప్రారంభానికి తుపానొచ్చింది. ఈ టైంకు వరి కోతలు మొదలై ఉండాలి. కానీ ఇప్పుడిప్పుడే నాట్లు పడుతున్నాయి. వేరుశనగ వేస్తే అది కూడా నిండా ముంచేసింది. అప్పు చేసి పంట కోసం పెడితే భూమైనా కళగా ఉంటాది. అప్పు చేసి పండుగ చేసుకుంటే మూడురోజుల ముచ్చట తీరిపోతుంది. అప్పులు తీర్చేవారెవరూ..!

– అమర్‌నాథ్‌రెడ్డి, సర్పంచ్, తాళంబేడు

తిరుమల శ్రీవారి కనులారా వీక్షించేందుకు భక్తులు ఎదురుచూస్తూ ఉంటారు. ప్రధానంగా వైకుంఠ ద్వార దర్శన భాగ్యం కోసం ఏడాది నుంచి ప్రయత్నిస్తుంటారు. అయితే తిరుపతిలో ఇటీవల జరిగిన తొక్కిసలాట ఘటన భక్తులను ఇప్పటికీ కలవరపెడుతోంది. టీటీడీ చరిత్రలోనే ఇలాంటి దుర్ఘటన ఇప్పటి వరకు చోటు చేసుకోలేదు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోపాటు టీటీడీ బోర్డు, అధికారుల అవగాహన, బాధ్యత రాహిత్యం కారణంగా ఆరుగురు భక్తులు మృత్యువాత పడ్డారు. ఇప్పటికీ శ్రీవారి భక్తులను ఇదో పీడకలలా వెంటాడుతోంది. తొక్కిసలాట దృశ్యాలను టీవీలు, సామాజిక మాధ్యమాల్లో చూసిన భక్తులు నేటికీ భయాందోళనలోనే ఉన్నారు.



భూదేవి కాంప్లెక్స్ వద్ద ఖాళీగా క్యూ

భక్తజనం.. వీడని భయం!

- వైకుంఠ ద్వార దర్శనంపై భక్తుల నిరాసక్తత
- 15 గంటలపాటు సాగిన 46వేల టోకెన్ల పంపిణీ
- జనం లేక బోసిపోయిన క్యూలు

తిరుపతి టాస్క్‌ఫోర్స్ : అత్యంత పవిత్రంగా భావించే వైకుంఠ ద్వార దర్శనానికి భక్తుల నుంచి స్పందన అంతంత మాత్రంగానే కనిపించింది. 13వ తేదీ సోమవారానికి సంబంధించి రెండు రోజుల ముందు శనివారం రాత్రి 9 గంటలకు టోకెన్లను కేటాయించనున్నట్లు టీటీడీ ప్రకటించింది. అదే రోజుకు సంబంధించి 46 వేల టోకెన్లను అందుబాటులో ఉంచింది. శ్రీనివాసం, విష్ణు నివాసం, అలిపిరి భూదేవి కాంప్లెక్స్‌లో మాత్రమే టోకెన్ల జారీ కేంద్రాలు ఏర్పాటు చేసింది. టోకెన్లు అందుబాటులో ఉన్నప్పటికీ భక్తుల రద్దీ మాత్రం ఆశించిన స్థాయిలో లేదు. శనివారం రాత్రి 9 గంటలకు ప్రారంభమైన టోకెన్ల జారీ ఆదివారం మధ్యాహ్నం సుమారు 15 గంటల పాటు కొనసాగింది. ఇదే సమయంలో క్యూలు జనం లేక బోసిపోయాయి.

టోకెన్ ఉంటేనే దర్శనం

వైకుంఠ ద్వార దర్శన టోకెన్ ఉంటేనే తిరుమల శ్రీవారి దర్శానానికి అనుమతిస్తామని టీటీడీ స్పష్టం చేయడంతో నడక మార్గం భక్తులుపూర్తిగా తగ్గిపోయారు. అలిపిరి మెట్ల మార్గంలో రెండు చోట్ల టోకెన్ పరిశీలించి భక్తులను అనుమతిస్తున్నారు. తొక్కిసలాటతో భక్తుల రద్దీ గణనీయంగా తగ్గిపోయింది. అయినా అధికారులు మాత్రం తొక్కిసలాట ముందు తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉండడంతో నడక మార్గం భక్తులకు కూడా తగ్గుముఖం పట్టారు. రద్దీ లేకున్నా తప్పనిసరి టోకెన్ అని తేల్చి చెబుతుండడంపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. టోకెన్ లేని భక్తులను కూడా ఎప్పటిలాగే అనుమతించి క్యూ కాంప్లెక్స్ నుంచి దర్శనానికి పంపించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

14వ తేదీ టోకెన్ల విడుదల

వైకుంఠ ద్వార దర్శన టోకెన్లు ఒకరోజు ముందు జారీ చేసేలా టీటీడీ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఆ ప్రకారం 13వ తేదీకి సంబంధించిన టికెట్లను 11వ తేదీ రాత్రి 9 గంటల నుంచి పంపిణీ మొదలుపెట్టారు. 14వ తేదీకి సంబంధించి 12వ తేదీ రాత్రి నుంచి ఇవ్వాల్సి ఉండగా రద్దీ లేకపోవడంతో ఆదివారం మధ్యాహ్నం నుంచే టికెట్లు జారీ చేశారు.

గోవిందా.. ఇంత చిన్నచూపా?

సాక్షి ప్రతినిధి, తిరుపతి: తిరుపతి తొక్కిసలాట ఘటనలో మరణించిన బాధిత కుటుంబాల పట్ల ఇటు ప్రభుత్వం, అటు టీటీడీ వ్యవహరిస్తున్న తీరుపై భక్తులు తీవ్రంగా అసహనం వ్యక్తం చేస్తున్నారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం అందజేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. అయితే టీటీడీనే చెక్కులు పంపిణీ చేయనున్నట్లు చైర్మన్ బీఆర్ నాయుడు శనివారం రాత్రి వెల్లడించారు. బోర్డు సభ్యులతో కమిటీని నియమించి మృతుల కుటుంబాలను పరామర్శించి చెక్కులు పంపిణీ చేస్తామన్నారు. దీనిపై భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మృతుల కుటుంబాలను సీఎం, టీటీడీ చైర్మన్ నేరుగా వెళ్లి పరామర్శించి చెక్కులు ఇచ్చేందుకు మనస్సు రాలేదా? అంటూ ప్రశ్నిస్తున్నారు.

పోలీసుల దురుసు ప్రవర్తన

శ్రీనివాసం వద్ద శనివారం రాత్రి 13వ తేదీకి సంబంధించిన టోకెన్లను తీసుకునేందుకు భక్తులు వచ్చారు. రద్దీ లేకపోయినప్పటికీ పోలీసులు, టీటీడీ సిబ్బంది దూకుడుగా వ్యవహరించారు. భక్తులతో వాగ్వాదానికి దిగి దురుసుగా ప్రవర్తించారు. దుర్భాషలాడడంతో భక్తులు సైతం ఆగ్రహం వ్యక్తం చేశారు. సుదూర ప్రాంతాల నుంచి శ్రీవారి దర్శనార్థం వస్తే ఇంత అమర్యాదగా వ్యవహరిస్తారా అంటూ ఆవేదన చెందారు. మహిళలు, చిన్నపిల్లలతో సైతం పోలీసులు, టీటీడీ విజిలెన్స్ సిబ్బంది అమానుషంగా ప్రవర్తించడం విమర్శలకు తావిస్తోంది. ఈ ఘటనను వీడియో తీస్తున్న భక్తులపై కూడా పోలీసులు దౌర్జన్యానికి దిగారు. ప్రస్తుతం ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

తలచుకుంటేనే భయమేస్తుంది



తిరుపతిలో వైకుంఠ ద్వార దర్శన టోకన్ల జారీ సమయంలో జరిగిన ఘటన తలచుకుంటేనే భయం వేస్తోంది. ఆ రోజు తిరుపతికి టోకెన్ల కోసం వచ్చాం. విషయం తెలిసి భయంతో ఊరికి వెళ్లిపోయాం. రష్ తగ్గింది అని సమాచారం అందగానే ఆదివారం మళ్లీ తిరుపతికి వచ్చి టోకెన్లు తీసుకున్నాం. క్యూలో ఇంకా భద్రత పెంచాల్సి అవసరముంది.

– త్యాగరాజున్, భక్తుడు, తిరుత్తణి

జాగ్రత్తలు తీసుకోవాలి



ప్రస్తుతం క్యూలు చాలా ఫ్రీగా ఉన్నాయి. ఇందుకు ప్రధాన కారణం భక్తులు ఇప్పుడు టోకెన్ల కోసం పెద్దగా రావడంలేదు, అందరూ భయపడిపోయారు. టీటీడీ అధికారులు, పోలీసులు ఇలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్త తీసుకోవాల్సిన అవసరం ఉంది. దేశవ్యాప్తంగా తొక్కిసలాటపై చర్చించుకుంటున్నారు. శ్రీవారి దర్శనం విషయంలో సామాన్య భక్తులకు పెద్ద పీట వేయాలి.

– మహాలక్ష్మి, భక్తురాలు, కోలార్

రోదన వర్ణనాతీతం



క్యూలో సరైన సదుపాయాలు లేకుండా భద్రతపై దృష్టి సారించకపోవడంతోనే ఇలాంటి ఘటన జరిగింది. ఎంత డబ్బులు ఇచ్చినా పోయిన మనిషిని తెచ్చివ్వలేరు. ఆ బాధను ఆ కుటుంబం జీవితాంతం అనుభవించాల్సిందే. తల్లికి దూరమైన బిడ్డ, భార్యకు దూరమైన భర్త రోదన వర్ణనాతీతం. వారికి కలిగిన నష్టం ఏవరూ తీర్చలేనిది. నాటి ఘటనను చూసినవారు చెబుతుంటేనే ఒళ్లు జలదరిస్తోంది.

–ప్రమీలమ్మ, భక్తురాలు, గుంటూరు

ప్రజల పక్షాన పోరాడుదాం



ఎంపీ మిథున్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు దామోదరరాజు

- గ్రామస్థాయిలో సూపర్‌సిక్స్ వైఫల్యాలపై వివరించండి
- మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి

చౌడేపల్లె: ఎన్నికల సమయంలో ప్రస్తుత ప్రభుత్వం ప్రకటించిన సూపర్‌సిక్స్‌తో పాటు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ప్రజల పక్షాన ప్రభుత్వంపై పోరాడదామని మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి సూచించారు. ఆదివారం తిరుపతిలోని పెద్దిరెడ్డి నివాసంలో ఇటీవల వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన చౌడేపల్లె జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు కలిశారు. తనపై నమ్మకంతో జిల్లాస్థాయిలో ఉపాధ్యక్షుడిగా పదవి కేటాయించడానికి కృషిచేసిన మాజీమంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పెద్దిరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం సూపర్‌సిక్స్‌తో పాటు ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా మోసపూరిత హామీలతో ప్రజలను మోసం చేస్తున్న తీరును గ్రామస్థాయిలో ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు అంజిబాబు, వైస్ ఎంపీపీ నరసింహులు యాదవ్, సర్పంచ్‌ల సంఘ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

నగరి: కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలలకే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, రానున్న రోజుల్లో వైఎస్సార్‌సీపీకి మంచి భవిష్యత్తు ఉందని మాజీమంత్రి ఆర్కే రోజా తెలిపారు. ఆదివారం ఆమె నగరిలోని పార్టీ కార్యాలయంలో నగరి రూరల్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా కృషి చేయాలన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు జరిగిన మేలును వివరించడంతో పాటు కూటమి సర్కారు వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. కిందిస్థాయి కార్యకర్తలతో మాట్లాడి, వారి అవసరాలను తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉత్తమ సర్వీస్ లక్ష్యంగా ఎస్వీ మోటార్స్ సేవలు



శ్రీవేంకటేశ్వర మోటార్స్ అధినేత లోకనాథరెడ్డి

తిరుపతి కల్చరల్: వినియోగదారులకు ఉత్తమ సర్వీస్ అందించడమే లక్ష్యంగా శ్రీవేంకటేశ్వర మోటార్స్ ఎస్ఎంఎల్ ఐఎస్‌యూజెడ్‌యూ లిమిటెడ్ నిరంతరం కృషి చేస్తుందని ఎస్వీ మోటార్స్ అధినేత పి.లోకనాథరెడ్డి తెలిపారు. 2024 నుంచి తమ సంస్థ విజయవంతంగా 20 ఏళ్లు పూర్తి చేసుకోవడంతో కస్టమర్ల మద్దతు మరువలేనిదన్నారు. భవిషత్‌లో కూడా నిబద్ధతతో కూడిన డోర్ స్టెప్ సర్వీస్ ద్వారా మరింత దగ్గరగా ఉండేందుకు కృషి చేస్తామన్నారు. కస్టమర్ల సహకారం మరింత అందిస్తూ తమ మెరుగైన సేవలను అందుకోవాలని కోరారు. కస్టమర్లందరూ సంక్రాంతి పండుగను సుఖసంతోషాలతో జరుపుకోవాలని కోరారు.

కేజీబీవీల్లోని ఖాళీలను భర్తీ చేయండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని కేజీబీవీ పాఠశాలల్లో ఉన్న పలు కేడర్ల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని రాష్ట్ర సమగ్ర శిక్ష శాఖ అధికారులు ఆదేశించారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వుల మేరకు జిల్లాలోని కేజీబీవీ(కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు)ల్లో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను సేకరించాలని పేర్కొన్నారు. సేకరించిన అనంతరం నిబంధనల మేరకు ఆ పోస్టులను భర్తీ చేయాలని జిల్లా సమగ్రశిక్ష ఏపీసీని ఆదేశించారు.

అక్రమ కేసుల కుప్పం

ఎక్కడైనా ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం అంటే అందరికీ ప్రత్యేక ఆసక్తి ఉంటుంది. అభివృద్ధి శరవేగంగా పరుగులు తీస్తుందనుకుంటారు. ప్రజలకు సక్రమంగా సంక్షేమ ఫలాలు అందుతాయని భావిస్తారు. కానీ మన ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలో మాత్రం పైన చెప్పిన వాటికి రివర్స్‌లో జరుగుతోంది. ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీని నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల మూడురోజుల కుప్పం పర్యటనలో తాను తప్పుడు కేసులను ఉపేక్షించనని చెప్పారు. కానీ ఇక్కడ పోలీసులను అడ్డు పెట్టుకుని వైఎస్సార్‌సీపీ నేతలు, కేడర్‌పై కేసులు నమోదు చేసి బలహీన పరిచే కుట్రలకు పాల్పడుతున్నారు.



- వైఎస్సార్‌సీపీని నిర్వీర్యం చేయడమే టార్గెట్
- హామీలపై ప్రశ్నిస్తే కేసులు, బైండోవర్లు
- దళిత సర్పంచ్‌ను ఊరి నుంచి తరిమికొట్టిన టీడీపీ నేతలు
- ప్రైవేటు కేసులు వేసి పోరాటానికి సిద్ధమైన క్యాడర్
- సీఎం చంద్రబాబు ఇలాఖాలో కుప్పంలో వింతపోకడలు

శాంతిపురం: రాష్ట్రంలో అధికార మార్పు జరిగిన తొలిరోజు నుంచి కుప్పంలో ఆటవిక రాజ్యం కొనసాగుతోంది. సీఎం చంద్రబాబు కుప్పానికి వచ్చిన ప్రతిసారీ రౌడీయిజాన్ని సహించనని, ప్రశాంతతకు విఘాతం కలిగిస్తే ఎవరినీ ఉపేక్షించనని చెబుతున్నా.. ఆ పార్టీ తమ్ముళ్లు మాత్రం పోలీసులను అడ్డం పెట్టుకుని దౌర్జన్యకాండను కొనసాగిస్తున్నారు. చట్టాలను అమలు చేయాల్సిన పోలీసులు దాన్ని పక్కన పెట్టి టీడీపీ నాయకుల ఆదేశాలను మాత్రమే అమలు చేస్తున్నారనే విమర్శలు భారీగా ఉన్నాయి.

ఊరి నుంచి తరిమేసి..

రామకుప్పం మండలం 89 పెద్దూరు పంచాయతీ దళిత మహిళా సర్పంచ్ మల్లిక కుటుంబాన్ని స్వగ్రామం నుంచి వెళ్లగొట్టారు. సర్పంచ్ పదవికి రాజీనామా చేయాలని వారి ఇంటిపై దాడి చేసి, సీసీ కెమెరాలను సైతం ధ్వంసం చేశారు. గ్రామంలో ఉండరాదని హుకుం జారీ చేశారు. ఆ మహిళా సర్పంచ్ తమ ఇంటిలో కూడా ఉండలేని పరిస్థితిని సృష్టించారు. దీనిపై పోలీసులతో పాటు ఇతర జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోయింది. గ్రామంలో అందుబాటులో లేరని, మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలకు రాలేదని పేర్కొంటూ సర్పంచ చెక్ పవర్‌ను రద్దు చేశారు. పైగా ఇసుక అక్రమ రవాణాలో విభేదాలు రావడంతో టీడీపీకి చెందిన ఇరువర్గాల ఘర్షణలో గాయపడిన వారి నుంచి ఫిర్యాదులు తీసుకుని మల్లిక భర్త గోవిందప్పపై హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. దీనిపై న్యాయం కోరుతూ బాధితులు మానవహక్కుల కమిషన్, ఎస్సీ కమిషన్‌ను ఆశ్రయించారు.

ఇసుక రవాణా కేసులో ఇరికించి..

నాయనపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ డైరెక్టర్ కృష్ణమూర్తి కర్ణాటకకు ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని కేసు నమోదు చేశారు. గతంలో ఎన్నడూ ఇసుక వ్యాపారం చేసిన చరిత్ర కూడా ఆయనకు లేదు. ఇల్లు కట్టేందుకు తన బంధువులు చట్టబద్ధంగా పన్నులు చెల్లించి, బైరెడ్డిపల్లి సాక్ట్ యార్డు నుంచి తెచ్చుకున్న ఇసుకను చూపి జైలుకు పంపారు. ఉదయం అదుపులోకి తీసుకుని, సాయంత్రం వీఆర్వో నుంచి ఫిర్యాదు రాయించుకుని, నిబంధనలు పాటించకుండా తనను అరెస్టు చేశారని కృష్ణమూర్తి చెప్పారు. పార్టీ మారినా, ఊరు వదిలి వెళ్లిపోయినా కేసులు లేకుండా చూస్తామని అధికారులు బెదిరించారని ఆయన వాపోయారు. సీజ్ చేసిన ఇసుకను అధికారులే అక్రమ మార్గంలో తరలించారని కృష్ణమూర్తి బంధువులు గగ్గోలు పెడుతున్నారు.

పొలానికి మట్టి తోలారని..

తమిళనాడు సరిహద్దుల్లోని ఓఎన్ కొత్తూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ సర్పంచ్ దేవప్పనాయుడు బంధువులు తమిళనాడు భూభాగంలోని చెరువు నుంచి అదే రాష్ట్రంలోని తమ పొలాలకు మట్టి తోలుకున్నారు. అయితే గుడుపల్లె మండలంలోని తల్లిఅగ్రహారం ప్రాంతంలోని ఆంధ్రా భూభాగం గుండా మట్టిని రవాణా చేశారని కేసు నమోదు చేశారు. దేవప్పనాయుడును, ఆయన తమ్ముడు పొండప్పనాయుడును రోజంతా పోలీసు స్టేషన్‌లో కూర్చోపెట్టి, మూడు రోజులు తిప్పుకున్నారు. ఆపై పొండప్పనాయుడుపై కేసు నమోదు చేసి రెండు ట్రాక్టర్లను సీజ్ చేశారు. ఇలా వరుస కేసులు, వేధింపులకు గురి చేసి కుప్పంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని నిర్వీర్యం చేయాలనే లక్ష్యంతో అధికార పార్టీ కుట్రలు చేస్తోంది.

హామీలపై మాట్లాడితే బైండోవర్..

గుడుపల్లె మండలం బోయనపల్లికి చెందిన రవి ఎన్నికల ముందు చంద్రబాబు అనేక హామీలు గుప్పించారని.. అధికారంలోకి వచ్చాక మరిచారని, సూపర్ సిక్స్ అమలు కావడం లేదని తన అభిప్రాయాన్ని మీడియా ముందు వ్యక్తం చేశాడు. దీనికిగానూ పోలీసులు అతని బైండోవర్ కేసు నమోదు చేసి, సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. మళ్లీ ఇలా మాట్లాడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. రాజ్యాంగం ఇచ్చిన వాక్ స్వాతంత్ర్యపు హక్కును కూడా కాలరాస్తున్నారు.

అభిమానంపైనా ఆంక్షలే..

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను కూడా జరుపుకోనివ్వకుండా కెనమాకులపల్లి లాంటి చోట్ల పోలీసులు మోహరించారు. తమ పార్టీ వారిపై పదుల సంఖ్యలో అక్రమ కేసులు, బైండోవర్ కేసులు నమోదు చేశారని వైఎస్సార్‌సీపీ నాయకులు చెబుతున్నారు. ఇప్పుడు తమ వారిని ఇబ్బందులు పెడుతున్న అధికారులు, అధికార పార్టీ నాయకులు భవిష్యత్తులో చట్టం ముందు దోషులుగా నిలబడక తప్పదని వారు హెచ్చరిస్తున్నారు. ఒత్తిళ్లను లెక్క చేయకుండా నిలబడుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు ప్రైవేటు కేసులు వేసి న్యాయ పోరాటానికి సిద్ధం అవుతున్నాయి.

కుటుంబ కలహాలతో..



మృతి చెందిన చిన్నారులు

నదుం: కుటుంబ కలహాలతో ఓ తల్లి తన పిల్లలతో కలిసి ఆత్మహత్యాయత్నానికి యత్నించిన సంఘటన మండల కేంద్రంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మండల కేంద్రంలోని మసీదు వీధికి చెందిన మన్సూర్ భార్య కరిష్మా (27) అత్త గవహర్ జాన్‌తో కుటుంబ సమస్యల కారణంగా వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో కరిష్మా తన పిల్లలు సిర్హా(2), జర ఫాతిమా (1)ని ఇంటి మిద్దె పైకి తీసుకెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించింది. కుటుంబ సభ్యులు గుర్తించి వారిని ఆస్పత్రికి తరలించారు. కరిష్మాకు ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటనలో ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'పార్వతీ'దేవిలా పెంచి పెద్ద చేస్తే..

- వృద్ధాప్యంలో ఉన్న తల్లిని నడిరోడ్డులో వదిలేసిన కర్కోటకులు
- పిడికెడు అన్నం పెట్టేందుకు కొడుకుల పితలాటకం
- అవసాన దశలో తల్లడిల్లిన వృద్ధురాలు
- కొడుకుల తీరును ఖండించిన గ్రామస్తులు
- పెద్దకొడుకు ఇంటికి తల్లిని చేర్చిన వైనం
- చౌడేపల్లి మండలంలో హృదయ విదారక ఘటన



ఏ.కొత్తకోటలో నడిరోడ్డులో తల్లిని వదిలేసిన దృశ్యం

చౌడేపల్లి: మానవత్వం మంటగలిపేలా.. సభ్య సమాజం తలదించుకునేలా..యావత్ సమాజం ఛీదరించుకునేలా వ్యవహరించిన కర్కోటక కొడుకుల కథ ఇది.. నవమాసాలు మోసి.. కంటికి రెప్పలా కాపాడి.. ప్రయోజకులను చేసిన ఆ తల్లే భారమైందని నడిరోడ్డుపై వదిలేశారు. కన్నతల్లి పేగుబంధానికి మచ్చ తెచ్చేలా.. కాటికి కాలుజాపిన ఆ తల్లికి పిడికెడు బువ్వ పెట్టేందుకు పితలాటకం ఆడిన ఇద్దరు కొడుకుల తీరుపై గ్రామస్తులకు తీవ్ర ఆగ్రహం తెప్పించింది. ఈ హృదయ విదారక ఘటన ఆదివారం చౌడేపల్లె మండలం ఏ.కొత్తకోట గ్రామంలో వెలుగు చూసింది. గ్రామస్తుల కథనం మేరకు వివరాలిలా.. ఏ.కొత్తకోటలో లింగప్ప, పార్వతమ్మ(87) దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. వీరికి పెళ్లిళ్లు అయ్యాయి. కుమార్తెలు బయట ప్రాంతాల్లో ఉండగా కుమారులు నాగరాజ, చంద్రమౌళి స్వగ్రామంలోనే వేర్వేరుగా ఉంటున్నారు. పదేళ్ల కిందట తండ్రి లింగప్ప మృతిచెందగా అప్పటి నుంచి చంద్రమౌళి వద్ద తల్లి పార్వతమ్మ ఉంటోంది. వృద్ధాప్యదశలో ఉన్న తల్లి పరిస్థితి రోజురోజుకు క్షీణించిపోయింది. తల్లిని చూసే బాధ్యత తనకు మాత్రమే కాదు.. తన అన్న నాగరాజుకు కూడా ఉందంటూ వాదులాటకు దిగాడు. ఆపై తల్లి సంరక్షణపై ఇద్దరూ పోటీ పడి.. నువ్వు అంటే నువ్వు చూసుకో అని వాదించుకున్నారు. చివరికి పార్వతమ్మను చిన్నకుమారుడు మంచం మీద పడుకోబెట్టి నడిరోడ్డుపై వదిలేసి వెళ్లిపోయాడు. నడివీధిలో ఆ తల్లి ఆర్తనాదాలు విన్న గ్రామస్తులు షఫీ, చిన్న, రవి, శ్రీనివాసులు, వెంకటరమణ అక్కడికి చేరుకున్నారు. అవసాన దశలో ఉన్న పార్వతమ్మను పరామర్శించి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఇద్దరు కుమారులు తల్లి పట్ల వ్యవహరించిన తీరును ఖండించారు. చివరికి ఆ వృద్ధురాలిని పెద్దకొడుకు నాగరాజ ఇంటికి చేర్చారు. అయితే పార్వతమ్మ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఇప్పుడు కొడుకులు వ్యవహరించిన తీరుతో ఆమె మనస్సు మరింత కలిచివేసిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

వారంలోనే రెండు ఘటనలు..

ఇలా కన్న తల్లిదండ్రులను పట్టించుకోకుండా రోడ్డుపై వదిలేసిన రెండు ఘటనలు ఈ వారంలోనే ఏ.కొత్తకోట పంచాయతీలో వెలుగు చూశాయి. ఆస్తులు రాయించుకుని అన్నం పెట్టేందుకు నిరాకరిస్తూ అవమానిస్తున్నారని సొంత కొడుకులపై అంకుతోటపల్లెకు చెందిన రాజమ్మ ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాజాగా ఆదివారం ఏ.కొత్తకోటలో ఆదివారం తల్లిని నడి రోడ్డుపై వదిలేసిన ఘటన చోటు చేసుకోవడం గమనార్హం.

కిటకిటలాడిన బోయకొండ

చౌడేపల్లె : గంగమ్మ దీవెనల కోసం భక్తులు ఆదివారం పెద్ద సంఖ్యలో తరలిరావడంతో బోయకొండ కిటకిటలాడింది. సంక్రాంతి సెలవులతోపాటు ఆదివారం కావడంతో ఉద్యోగులు, విద్యార్థులు, యువత గంగమ్మను దర్శించుకునేందుకు వచ్చారు. ఆలయంలోని క్యూలన్నీ కిక్కిరిశాయి. అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కోర్కెలు తీరిన భక్తులు పిండి, నూనె దీపాలు వెలిగించారు. వారికి ఆలయ ఈవో ఏకాంబరం ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఒక్కరోజు ఆదాయం రూ.6.80 లక్షలు

ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి సుమారు 25 వేల మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం వివిధ వాహనాల్లో వచ్చినట్టు అధికారులు తెలిపారు. ఈ క్రమంలో టికెట్లు, ప్రసాదాల ద్వారా రూ.6.80,150 ఆదాయం వచ్చినట్టు పేర్కొన్నారు. అన్నదానానికి రూ.9,500 వచ్చినట్లు చెప్పారు.

యువతకు ఆత్మస్థైర్యమే తొలిమెట్టు



బంగారుపాళెం: దేవరకొండపై ట్రెక్కింగ్‌కు వెళ్తున్న యువత, ఫారెస్టు అధికారులు

బంగారుపాళెం: యువత ఉన్నతికి తొలిమెట్టు ఆత్మస్థైర్యమేనని జిల్లా అటవీశాఖాధికారి భరణి అన్నారు. ఆదివారం పలమనేరు అటవీశాఖ రేంజ్ అధికారుల ఆధ్వర్యంలో ట్రెక్ చిత్తూరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలోని గౌరీశంకరపురం నుంచి మొగిలి దేవరకొండపైకి ట్రెక్కింగ్ చేశా రు. చిత్తూరు, తిరుపతి, పలమనేరు, బెంగళూరు నుంచి పలువురు యువతీ యువకులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత ఉన్నత శిఖరాలను అందుకోవాలనే లక్ష్యసాధనకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని సూచించారు. ట్రెక్కింగ్‌తో శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో తిరుపతి డీఎఫ్ఓ నరేంధిరన్, పలమనేరు రేంజ్ అధికారి నారాయణ, ఎఫ్ఎస్ఓలు రమేష్, సురేంద్ర, సుకుమార్, ఎఫ్‌బీఓలు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా వెలుగులు నింపాలి



కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ



జాయింట్ కలెక్టర్ విద్యాధరి



జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు

చిత్తూరు కలెక్టరేట్ : తెలుగింట పెద్ద పండుగ అయిన మకర సంక్రాంతి పర్వదినాన్ని ప్రజలంతా సంబరంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. ఈ మేరకు వారు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. సంస్కృతీ, సంప్రదాయాలకు నిలయమైన సంక్రాంతి పండుగను జిల్లాలోని తెలుగు ప్రజలంతా ఆనందంగా జరుపుకోవాలన్నారు. ఈ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. పాడి పంటలతో రైతులంతా సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. భోగి మంటలు, రంగ వల్లులు, హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల ఆటలు, గాలి పటాల సందళ్లు గ్రామాలకు సంక్రాంతి శోభను తీసుకొస్తాయన్నారు. అలాగే ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఆర్వో మోహన్‌కుమార్ మాట్లాడుతూ ఈ మకర సంక్రాంతికి తెలుగు లోగిళ్లలో ప్రతి ఇంటా ఆనందాల సిరులు వెల్లివిరియాలని' ఆకాంక్షించారు.

పండుగ వేళ .. బాదుడు

సంక్రాంతి పండుగ.. ఆపై వరుస సెలవులు రావడంతో ప్రైవేటు ట్రావెల్స్ దోపిడీ మొదలుపెట్టాయి. సొంతూర్లకు వచ్చే వారి నుంచి ట్రావెల్స్ యాజమానులు అధిక చార్జీలు వసూలు చేస్తూ దోచేస్తున్నారు. రాష్ట్రప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఇష్టారీతిన వసూలు చేస్తున్నారు. దీనిపై ప్రయాణికులు మండిపడుతున్నారు. ఒక కుటుంబం సొంతూరికి వచ్చిపోవాలంటే.. రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు చార్జీలకే ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

	ఏసీ స్లీపర్		నాన్ ఏసీ	
ప్రాంతం	సాధారణ ధర	పండగ ధర	సాధారణ ధర	పండగ ధర
బెంగళూరు	రూ.899	రూ.2000	రూ.500	రూ.1000
హైదరాబాద్	రూ.1500	రూ.3500	రూ.1000	రూ.2500
విజయవాడ	రూ.1000	రూ.2500	రూ.600	రూ.1500



- సంక్రాంతికి వరుస సెలవుల నేపథ్యంలో ప్రయాణికులపై బాదుడు
- బరితెగించిన ప్రైవేటు ట్రావెల్స్
- తడిసి మోపెడవుతున్న చార్జీలు
- వచ్చి, పోనూ రూ.15 వేల వరకు రవాణా ఖర్చు
- ఫిర్యాదుల నేపథ్యంలో తనిఖీలు ప్రారంభించిన రవాణాశాఖ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): పండుగ వేళ ప్రైవేట్ ట్రావెల్స్ ప్రయాణికుల రక్తం తాగేస్తున్నాయి. జిల్లా నుంచి ఇతర ప్రాంతాల నుంచి ప్రతి రోజూ సుమారు 160కు పైగా ట్రావెల్స్ బస్సులు తిరుగుతున్నాయి. ఇందులో అధికంగా కర్ణాటక, చెన్నై, విజయవాడ, నెల్లూరు, తిరుపతి ప్రాంతాలకు అధికంగా నడుస్తున్నాయి. ఈ రాకపోకల్లో ప్రైవేటు, ఆర్టీసీలతో కలిపితే సుమారు 30వేలకు పైగా రాకపోకలు సాగిస్తుంటారని అంచనా. పండుగ సమయాల్లో ఈ సంఖ్య మరింత అధికంగా ఉంటుందని రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ నెల 13న సోమవారం భోగి, 14న సంక్రాంతి, 15న కనుమ పండగ వచ్చింది. 11వ తేదీ రెండో శనివారం, 12న ఆదివారం కావడంతో ఉద్యోగులకు వరుసగా ఐదురోజులు సెలవులు వచ్చాయి. ఈ నెల 9 నుంచి 19వ తేదీ వరకు స్కూళ్లకు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో సంక్రాంతి సెలవులిచ్చారు. అదే సాఫ్ట్‌వేర్ రంగంలో శుక్రవారాల్లో సెలవు పెట్టుకుంటే వరుసగా 9 రోజులు కలిసివస్తాయి. ఈ రీతిలో ఉద్యోగులు, విద్యార్థులకు వరుస సెలవులు రావడంతో సంక్రాంతి పండగకు తమ సొంతూళ్లకు వచ్చేందుకు హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాల్లోని బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు కిటకిటలాడుతున్నాయి. శుక్రవారం నుంచే బెంగుళూరు నుంచి ప్రయాణాలు మొదలయ్యాయి. బస్సులన్నీ కిక్కిరిస్తున్నాయి. శనివారం..ఆదివారం బస్సులన్నీ రద్దీగా కనిపించాయి. ఈ నేపథ్యంలోనే ప్రైవేటు ట్యాక్సీలు మనిషికి రూ.1000 నుంచి రూ. 2,000 వేల వరకు చార్జీలు వసూలు చేస్తూ దోపిడీకి గురి చేస్తున్నాయి.

మొదలైన తనిఖీలు..

ప్రైవేటు బస్సుల చార్జీల పెంపుపై రవాణా శాఖ అధికారులకు ఫిర్యాదుల పరంపర మొదలైంది. దీంతో శుక్రవారం రాత్రి నుంచి తనిఖీలు మొదలుపెట్టారు. జిల్లా కేంద్రంలో తనిఖీలు చేయగా పలు కేసులు పట్టుబడ్డాయి. అధిక చార్జీలు ఉంటే రూ.10 వేలు, అనధికారిక లగేజీలు ఉంటే రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తున్నారు. రెండురోజులకు గానూ 25 కేసులకు గానూ రూ.2.50 లక్షలు జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు.

రెండింతలు అదనంగా వసూలు

సంక్రాంతి పండగ పేరుతో ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు సాధారణ చార్జీల కంటే అదనంగా రెండు నుంచి మూడు రెట్లు పెంచాయి. జిల్లా నుంచి హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ నుంచి జిల్లాకు ప్రతిరోజు 160కు పైగా బస్సులు తిరుగుతుంటాయి. పండుగ పేరుతో ఈ నెల 10, 11 తేదీల్లో అమాంతం చార్జీలు పెంచారు. పండగ తరువాత తిరిగి వెళ్లాలంటే 15 నుంచి 19వ తేదీ ఆదివారం వరకు అదే ధరలు ఉన్నాయి. టికెట్ కోసం వెబ్‌సైట్ ఓపెన్ చేస్తే ఒక చార్జీ ఉంటుందని, తీరా బుకింగ్ చేసుకుందామని క్లిక్ చేస్తే మరో చార్జీ కనబడుతోందని ప్రయాణికులు వాపోతున్నారు.

జరిమానా తప్పదు..



సంక్రాంతి పేరు చెప్పి ప్రైవేట్ యాజమాన్యాలు అధిక చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. రెండు రోజులుగా చిత్తూరు నగరంలోని జాతీయ రహదారిపై తనిఖీలు చేస్తున్నాం. పండగ సెలవులు పూర్తయ్యేంత వరకు ఈ తనిఖీలు జరుగుతుంటాయి. పట్టుబడిన వారికి జరిమానా వేస్తున్నాం. అధిక చార్జీలు వసూలు చేశారని ప్రయాణికులు ఫిర్యాదు చేస్తే ఆ బస్సు యాజమాన్యంపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

– నిరంజన్‌రెడ్డి, డీటీసీ, చిత్తూరు